క్లుప్తంగా

లీకేజీని అరికట్టాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని సర్దార్ తండా శివారులో మిషన్ భగీరథ పైప్‌లైన్ వాల్ నుంచి నీరు లీకేజీ అవుతున్నాయి. భగీరథ పైప్ లైన్ మరమ్మతులు చేయించి లీకేజీని అరికట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు. లీకేజీ అవుతున్న నీటితో పంటలకు ఇబ్బంది కలుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మిషన్ భగీరథ పైప్‌లైన్ వాల్ నుంచి లీకేజీ అవుతున్న నీటిని వెంటనే అరికట్టాలని కోరుతున్నారు.

నీటి ప్రవాహం తగ్గిన వెంటనే పనులు చేపడతాం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఆగస్టులో కురిసిన భారీ వర్షాల కారణంగా ఏర్పడిన ఇసుక మేటలను తొలగించడానికి సర్వే నిర్వహించినట్లు ఎంపీడీవో నరేష్ తెలిపారు. 19 గ్రామాల్లో సర్వే చేయగా 287.33 ఎకరాల్లో ఇసుక మేటలు ఏర్పడినట్లు తెలిపారు. ఇందులో 190 మంది రైతులకు సంబంధించి 192 ఎకరాలకు ఎస్టిమేట్లు తయారు చేసి పీడీ డీఆర్‌డీఏకు పంపినట్లు తెలిపారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉన్నందున నీటి నిల్వలు తగ్గిన వెంటనే మిగిలిన పనులు రైతుల సహకారంతో రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు.

పలకలు, నోట్ బుక్స్ పంపిణీ



పిట్లం(జుక్కల్): కంభాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు పల్లవి తన స్వంత ఖర్చులతో విద్యార్థులకు పలకలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో కలిసి పనిచేయాలి

మద్నూర్(జుక్కల్): రానున్న సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలందరూ కలిసి పని చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దరాస్ సాయిలు తెలిపారు. సలాబత్‌పూర్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా ఉండి పని చేయాలని అన్నారు. మండల అభివృద్ధే తమ కర్తవ్యమని, దీనికి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. మండలంలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే చెప్పారన్నారు. నాయకులు హన్మండ్లు స్వామి, రాంపటేల్, శీనుపటేల్, విఠల్ గురుజీ, గంగాధర్, దేవిదాస్ పటేల్, రమేశ్ తదితరులున్నారు.

మున్నూరుకాపు విద్యార్థులకు ఆర్థిక సహాయం



కామారెడ్డి అర్బన్: పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చూపిన మున్నూరుకాపు విద్యార్థులకు గురువారం మున్నూరుకాపు కాచిగూడ ట్రస్టు ద్వారా మంజూరైన ఆర్థిక సహాయంతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. పదవ తరగతి విద్యార్థులు 79 మందికి ఒక్కొక్కరికి రూ.1,800, ఇంటర్ విద్యార్థులు 22 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున అందజేశారు. కామారెడ్డి వైద్య కళాశాల సమీపంలోని మున్నూరుకాపు సంఘం జిల్లా భవనం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య, రాష్ట్ర నాయకులు గోపాల్ రాధాకృష్ణ, కొమ్ము శ్రీనివాస్, హనుమంతుల ప్రహ్లాద్, పెద్ది పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆలయ ప్రారంభోత్సవ ఆహ్వానం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలో ఈ 24న ప్రారంభించనున్న రేణుకా ఎల్లమ్మ, జమదగ్ని, చింతల పోచమ్మ ఆలయ ప్రారంభోత్సవానికి హాజరు కావాల్సిందని పట్టణ గౌడ సంఘం సభ్యులు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు మొదటి ఆహ్వాన పత్రికను అందజేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కలిసిన గౌడ సంఘం సభ్యులు 24 నుంచి 28 వరకు జరిగే విగ్రహాల ప్రతిష్ఠాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఆహ్వానించారు.

ఈ చిత్రంలో కనిపిస్తున్నది గొడుగు మర్రి తండా ప్రాథమిక పాఠశాల. ఐదు తరగతులకు ఓకే గదిలో బోధన జరుగుతుండడంతో ఏ తరగతికి సంబంధించి బోధన జరుగుతుందో విద్యార్థులకు అర్థం కాక.. ఎవరు వినాలో ఎవరు వేచి ఉండాలేనో అర్థం కాని పరిస్థితి ఉంది. ఈ పాఠశాలలో 21 మంది విద్యార్థులు.. ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. ఐదు తరగతులకు ఒక తరగతి గది మాత్రమే అందుబాటులో ఉంది. ఇదే జీపీ పరిధిలోని మొండి వీరన్నపల్లి తండాలో 30 మంది విద్యార్థులు ఉండగా ఓకే తరగతి గదిలో ఐదు తరగతి లకు సంబంధించి బోధన జరుగుతుంది. అక్కడ కూడా అందర్నీ ఒకే దగ్గర కూర్చోబెట్టి తరగతులు చెప్తున్నారు.



తండాల్లో అటకెక్కిన సర్కార్ చదువులు

- పలు చోట్ల ఒకటే గదిలో నాలుగైదు తరగతులకు బోధన
- జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి
- మూత పడుతున్న తండాల్లోని సర్కార్ బడులు



మూతపడిన రాజమ్మ తండా సర్కార్ బడి

రామారెడ్డి: తండాల్లో సర్కార్ చదువులు రోజురోజుకి మరింతగా దిగజారిపోతున్నాయి. చెట్ల కిందనో లేక ఒకే తరగతి గదిలో ఐదు తరగతి గదులకు బోధన చేయడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది. ఇప్పటికే రామారెడ్డి మండలంలోని రాజమ్మ తండా ప్రాథమిక పాఠశాలను విద్యార్థులు లేరనే కారణంతో మూడేళ్ల క్రితం మూసి వేశారు. అలాగే సున్నపురాళ్ల తండా సర్కార్ బడిని కూడా మూసి వేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తండాల్లో సర్కార్ బడి బాగు కోసం ఒక్క అడుగు కూడా ముందుకు పడ్డ దాఖలాలు కనిపించడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా కనీసం ఉన్న ఒక తరగతి గదికి మరో తరగతి గదిని నిర్మించకపోవడం తండాల్లో చదువుల పరిస్థితికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. జిల్లాలో అనేక తండాలలోని ప్రాథమిక పాఠశాలలో పరిస్థితి ఇలాగే ఉంది. ఒకే తరగతి గదిలో ఐదు తరగతు విద్యార్థులను కూర్చోబెట్టి వరుస బట్టి ఒక్కో తరగతికి బోధన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఏ తరగతికి బోధిస్తున్నారో..

ఐదు తరగతుల విద్యార్థులను ఒకే తరగతి గదిలో కూర్చోబెట్టడం వల్ల ఏ తరగతికి బోధిస్తున్నారని తెలియని అయోమయంలో విద్యార్థులున్నారు. దీని వల్ల విద్యార్థుల సామర్థ్యాలు మరింత తగ్గిపోతున్నాయి తప్ప పెరగడం లేదు. పక్కపక్కనే తండాలున్నా అక్కడ ఇక్కడ ఇలాంటి పరిస్థితులే ఉండటంతో తండావాసులు కూడా చేసేదేం లేక ఉన్నచోట స్కూళ్లకు పంపిస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో 216 తండా జీపీలున్నాయి. జీపీలైనంత మాత్రాన తండాల రూపురేఖలు మారవని ప్రభుత్వాలు తెలుసుకోవాలని తండా వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సరిపడా నిధులు ఇచ్చి విద్యార్థులకు సరైన బోధన చేస్తే మాత్రమే తమ బతుకులు బాగుపడతాయని చెబుతున్నారు.

చదువులకు దూరం



తండాల్లోని విద్యార్థులను ప్రభుత్వం చదువులకు దూరం చేస్తోంది. కొన్ని జీపీలలో అసలే సర్కార్ బడులే లేవు. ఉన్న తండా జీపీల్లోని సర్కార్ బడిలో మౌలిక వసతులు తీవ్రంగా వేధిస్తున్నాయి. ఎన్ని ప్రభుత్వాలు మారినా తండాలను పట్టించుకున్న పాపాన పోవడం లేదు. నేటి తరంలో కూడా ఒక తరగతిలో 5 తరగతుల విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్నారంటే తండాల పట్ల ప్రభుత్వాలు ఎంత నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నాయో తెలుస్తోంది.

– గణేష్ నాయక్, జిల్లా అధ్యక్షుడు, లంబాడ హక్కుల పోరాట సమితి

పెద్ద హాలు అయినా నిర్మించాలి



తండాలో ప్రాథమిక విద్య దారుణంగా తయారైంది. ఒక పెద్ద హాల్ అ యినా నిర్మించి పార్టిషన్ చేసి ప్రతి తరగతి గదికి ఓ ఉపాధ్యాయుడు ఉంటే తండా విద్యార్థులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం ఈ దిశగా కృషి చేయకుండా విద్యార్థులు లేరనే కారణం చూపి తండాల్లో పాఠశాలలను మూసివేయడం సరి కాదు. విద్యను దూరం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లుంది ప్రభుత్వ నిర్వాకం.

– దేవులా, డీటీఎఫ్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు

ఆహారాన్ని వృథా చేయొద్దు

- ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



వంటకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్‌కే డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు సృజనాత్మకత, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. యువత దేశ సంస్కృతిని కాపాడాలని కోరారు. ఆహారాన్ని వృథా చేయకూడదని, వీలైనంత వరకు పేదలకు ఆహారం అందించాలని కోరారు. విద్యార్థులు తయారు చేసిన వంటకాలను ఎమ్మెల్యే రుచి చూసి అభినందించారు. కళాశాల సీఈవో జైపాల్ రెడ్డి, తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్‌లు విద్యావర్ధిని, అపర్ణ, సుధాకర్ గౌడ్, జవేరియా, నాగరాజు, కళాశాల చైర్మన్ భాస్కర్ రావు, డీన్ నవీన్ కుమార్, ప్రిన్సిపల్‌లు గోవర్ధన్ రెడ్డి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధితో సుఖ సంతోషాలు

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



నియామక పత్రాన్ని అందజేస్తున్న షబ్బీర్ అలీ

భిక్కనూరు: దేవాలయాల అభివృద్ధితో సుఖ సంతోషాలు వెల్లి విరుస్తాయని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. గురువారం ఆయన ప్రభుత్వం నియమించిన భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయం పునరుద్ధరణ కమిటీ సభ్యులకు నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమిటీ సభ్యులుగా అవకాశం రావడం దేవుడికి సేవ చేసే అదృష్టంగా భావించి ఆలయ అభివృద్ధికి నిస్వార్థంగా పనిచేయాలన్నారు. సిద్ధరామేశ్వరాలయం అభివృద్ధికి తాను అన్ని విధాలా సహకారం అందజేస్తానని అన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీరాం వెంకటేశ్, విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం



బాన్సువాడ రూరల్: బీర్కూర్ మండలం బరంగెడ్గి గ్రామానికి చెందిన దమ్మని అనిల్‌కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా అంతర్జాతీయ ఐకాన్ అవార్డు అందజేశారు. సావిత్రీబాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో హైకోర్టు రిటైర్డ్ జడ్జి మాల్యాద్రి, ఏసీపీ తేజావత్ రామదాసు ప్రదానం చేశారు.

నాణ్యమైన విద్యను అందించాలి



భిక్కనూరు: ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని భిక్కనూరు ఎంఈవో రాజ్‌గంగారెడ్డి అన్నారు. గురువారం ఆయన భిక్కనూరు మండలం భాగిర్తిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

ఆర్టీఐ చట్టాలపై అవగాహన కల్పించాలి



భిక్కనూరు: సమాచార హక్కు చట్టాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్ దేశాల్ భూపాల్ అన్నారని కామారెడ్డి జిల్లా ఆర్టీఐ ఉపాధ్యక్షులు మోతె లావణ్య తెలిపారు. గురువారం ఆమె హైదరాబాద్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. పలు సంస్థలతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆయన సూచించినట్లు వివరించారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా



బాన్సువాడ: బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో పని చేస్తున్న సానిటేషన్ కార్మికులకు బకాయి పడ్డ వేతనాలు చెల్లించాలని గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. ఆస్పత్రిలో సానిటేషన్, పేషంట్ కేర్ తదితర విభాగాల్లో పని చేస్తున్నామని, గత నాలుగు నెలలుగా సంబంధిత ఏజెన్సీ కాంట్రాక్టర్ వేతనాలు ఇవ్వడం లేదని వాపోయారు. పండుగల సమయంలో వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. వెంటనే బకాయిపడ్డ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు కమర్, రేణుక, సురేఖ, కల్యాణి, సుజాత తదితరులున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

భిక్కనూరు: ఇసన్నపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీదేవి ఆలయం నిర్మాణానికి విద్యాదాత తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి రూ.21 వేలను విరాళంగా గురువారం పంపించారు. అలాగే ఆలయం నిర్మాణానికి అవసరమైన టైల్స్, గ్రానైట్‌ను సొంత డబ్బుతో వేయించేందుకు సమ్మతించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు సుభాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆలయం అభివృద్ధికి పూర్తి సహకారాలను అందిస్తానని పెద్దమల్లారెడ్డి విండో చైర్మన్ రాజాగౌడ్ హామీ ఇచ్చారు.

రుణాల రికవరీ శాతాన్ని పెంచాలి



మాట్లాడుతున్న ఏపీఎం రాంనారాయణగౌడ్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మహిళా సంఘాల సభ్యుల నుంచి బకాయి రుణాల రికవరీ శాతాన్ని మరింత పెంచాలని ఐకేపీ ఏపీఎం రాంనారాయణగౌడ్ సూచించారు. నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయంలో బుధవారం వీవోఏలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల లక్ష్యాన్ని నెరవేర్చేలా వీవోఏలు విధులు నిర్వహించాలన్నారు. దీంతోపాటు పంటకోతలు మొదలైన నేపథ్యంలో రుణాల రికవరీపై కూడ దృష్టి సారించాలని చెప్పారు. మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మండలంలో స్త్రీనిధి రుణాలకు సంబంధించి 739 మంది సభ్యుల నుంచి రూ.కోటి 25 లక్షలు రావాల్సి ఉందని చెప్పారు. మండల సమాఖ్య అధ్యక్షులు శాంత, స్త్రీనిధి జిల్లా రీజనల్ మేనేజర్ కిరణ్, యూనియన్ బ్యాంకు మేనేజర్ వికాస్ షిండే, ఫీల్డ్‌ఆఫీసర్ గౌరవ్, సీసీలు పాల్గొన్నారు.

పర్యావరణ ఆహార పదార్థాలు, వస్తువుల ప్రదర్శన



కామారెడ్డి అర్బన్: ప్రజల్లో పర్యావరణంపై అవగాహన, చైతన్యం కల్పించడానికి పర్యావరణ ఆహార పదార్థాలు, వస్తువుల ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ అన్నారు. గురువారం కళాశాలలో ఆహార పదార్థాలు, పర్యావరణ వస్తువుల ప్రదర్శనను జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. పర్యావరణ హిత వస్తువులను విద్యార్థులు, అధ్యాపకులు కొనుగోలు చేసేలా ప్రోత్సహించారు. ప్రదర్శనలో బాగా ఉన్న మూడు స్టాళ్లను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళల భద్రతపై అవగాహన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మహిళల భద్రతపై షీటీం పోలీసులు బుధవారం నాగిరెడ్డిపేట మోడల్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం కానిస్టేబుళ్లు సుప్రజ, శ్రీశైలం మాట్లాడుతూ.. సైబర్‌క్రైం జరిగిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేయాలన్నారు. మహిళలకు సంబంధించి ఏమైనా వేధింపులకు గురైతే 8712686094 నంబర్‌కు కాల్ చేయాలని వారు చెప్పారు. దీంతోపాటు రోడ్డు భద్రత గురించి వారు వివరించారు. అత్యవసర సమయాలలో 100 నంబర్‌కు కాల్ చేయాలని వారు పేర్కొన్నారు.

కార్యకర్తలు పార్టీకి మూల స్తంభాలు



మాట్లాడుతున్న పీసీసీ డెలిగేట్ విఠల్‌రెడ్డి

బిచ్కుంద(జుక్కల్): కార్యకర్తలు పార్టీకి మూల స్తంభాలని, వారి కృషి వల్లే నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం వచ్చిందని పీసీసీ డెలిగేట్ విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓ దినపత్రికలో జుక్కల్ కాంగ్రెస్ పార్టీలో సమన్వయలోపమని వచ్చిన వార్తలో ఎలాంటి నిజం లేదని, ఆ వార్తను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, కాంగ్రెస్ నేతలకు, కార్యకర్తలకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో ఓడిపోతామని ప్రతిపక్షాలకు భయం వెంటాడుతోందన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అందరి సమస్యలు వింటూ పరిష్కరిస్తున్నారని, ప్రజలు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటున్నారని అన్నారు. నాయకులు దడ్గి నాగ్‌నాథ్, వెంకట్‌రెడ్డి, గంగాధర్, సాహిల్ షెట్కార్, రవి పటేల్, నౌషా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలి



దోమకొండ: ఐకేపీ మహిళా సంఘాల ద్వారా చేపట్టే ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలని ఐకేపీ ఏపీడీ విజయలక్ష్మి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో దోమకొండ, మాచారెడ్డి, భిక్కనూరు, బీబీపేట మండలాలకు చెందిన మహిళా సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లపై వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఆమె తెలిపారు. కొనుగోలు కేంద్రాల కమిటీ సభ్యులు, ట్యాబ్ ఆపరేటర్లు, బుక్‌కీపర్‌లకు అవగాహన కల్పించారు. ఐకేపీ డీపీఎం సాయిలు, ఏపీఎం శ్రీనివాస్, రాజు, సీసీలు రమేష్, విజయ్, లింగం, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం



బాన్సువాడ రూరల్: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలను నోడల్ ఆఫీసర్‌గా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఇస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంపై ఎస్‌జీటీల సంఘం హర్షం వ్యక్తం చేసింది. గురువారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గ్రీన్ రిబ్బన్‌లు ధరించి తెలంగాణ ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు తెలిపారు. సంఘం కామారెడ్డి జిల్లా కార్యదర్శి అయ్యాల సంతోష్ మాట్లాడుతూ..ఇదే స్ఫూర్తితో నెలకోసారి నిర్వహించే కాంప్లెక్స్ సమావేశాల బాధ్యతలను కూడా అప్పగించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఎస్‌జీటీలకు రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు గోపి, సాయిరాం, చైతన్య, సత్యనారాయణ తదితరులున్నారు.

గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశమైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం రాజులు, పార్టీ నేతలు, కార్యకర్తలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం రాజులు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరపున బరిలో నిలిచే అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు రామ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు, జిల్లా కౌన్సిల్ మెంబర్ పోలబోయిన సాయిలు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు చంద్ర నాయక్, మండల ప్రధాన కార్యదర్శి భూమ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఉద్యమ నేత బాపురెడ్డి వర్ధంతి

బాన్సువాడ: తెలంగాణ ఉద్యమ నేత డాక్టర్ బాపురెడ్డి ప్రథమ వర్ధంతిని గురువారం బాన్సువాడలో మలిదశ ఉద్యమకారులు ఘనంగా నిర్వహించారు. ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో బాపురెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అయ్యప్ప ఆలయం వద్ద బాపురెడ్డి పేరుపై అన్నదానం నిర్వహించారు. మిత్రబృందం బాబుషిండే, సాగర్‌షిండే, నార్ల రత్నకుమార్, కొత్తకొండ భాస్కర్, మలిదశ ఉద్యమకారులున్నారు.

ఫరీదుపేటలో సామూహిక సీమంతాలు

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీదుపేటలో గురువారం రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, చంద్రకళ, వనజ, ప్రసన్నలు ఉన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలి

కామారెడ్డి అర్బన్: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటన స్ఫూర్తిగా పార్టీ జిల్లా అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల ప్రచారంలో కామారెడ్డిలో కర్నాటక సీఎం సిద్ధరామయ్య సమక్షంలో రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్ చేశారన్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ చొరవ తీసుకుని బీసీలకు జిల్లా అధ్యక్ష పదవి వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు.

ప్రతిభా స్కాలర్‌షిప్ అందుకోవడం అభినందనీయం



బాన్సువాడ రూరల్: శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాల(బాన్సువాడ)కు చెందిన విద్యార్థి బి.సురేందర్ ఎస్‌బీఐ ప్రతిభ పరీక్షల్లో రూ.30 వేల స్కాలర్‌షిప్ అందుకోవడం అభినందనీయమని ప్రిన్సిపల్ గంగాధర్ అన్నారు. మారుమూల చింతల్‌పేట్ తండా నుంచి వచ్చి డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతూ..ఎన్‌సీసీ క్యాడెట్‌లో కొనసాగుతూ ప్రతిభ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన సురేందర్‌ను అధ్యాపకులతో కలిసి గురువారం కళాశాలలో అభినందించారు. సురేందర్‌ను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ప్రతిభ స్కాలర్‌షిప్‌లకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు విఠల్, శ్రీనివాస్, శంకర్‌రావు, బాలరాజు, అనిత, యూనిస్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో గురువారం ఆదిత్య ఆస్పత్రి, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. 165 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు మారుతి, రామాంజనేయులు, భూపేష్ కుమార్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.